జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త
తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి వెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

ఆదివారం | 14-07-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 71 పేజీలు: 8 వెల : రూ.7



# ఎవడప్ప

* ఎస్ఈబీలో ముగ్గురితో ప్రత్యేక బృందం * అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న బృంద సభ్యులు * ఇసుక నుంచి మద్యం వరకూ నెలవారీ కలెక్షన్లు *భూదందాల నుంచి సెటిల్‌మెంట్ల సొమ్ముల వసూళ్ల బాధ్యత వీరిదే * ఉన్నతాధికారి అండతోనే ఈ దందా * పంపకాల్లో తేడాలు * బృందంలో లుకలుకలు * బయటపడుతున్న విభేదాలు * సోషల్ మీడియాకు లీకులిస్తున్న ఒకడు * అతడిపై ఆరా తీస్తున్న బృంద సభ్యులు * ఉన్నతాధికారి దృష్టికి తీసుకువెళ్లిన సభ్యులు * బయటపడితే పరువుపోతుందన్న భయంలో ఉన్నతాధికారి

**శ్రీకాకుళం క్రైం, జులై 13 (వార్త):** జిల్లాలో స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ (ఎస్ఈబీ) పేరిట ఒక పోలీసు టీం నడుస్తోంది. ముగ్గురు పోలీసులు ఈ బృందంలో ఉన్నారు. వీరు జిల్లాకు చెందిన ఓ ఉన్నతాధికారి కనుసన్నల్లో విధులు నిర్వహిస్తున్నారు. ఉన్నతాధికారి చెప్పిన మేరకు పనులు చేస్తుంటారు. వీరు లా అండ్ ఆర్డర్‌లో విధులు నిర్వహించాల్సివుంది. కానీ ప్రతినెలా మామూళ్లు వసూలు చేయడమే వీరి పని. ఇసుక నుంచి మద్యం వరకూ వీరు కలెక్షన్లు తీసుకువచ్చి ఆ అధికారికి ఇస్తుంటారు. ఇందులో వీరు కొంత నొక్కేస్తుంటారు. ఆ ఉన్నతాధికారికి లక్షల్లో కలెక్షన్లు ఇస్తూ వీరు వేలల్లో స్వాహా చేస్తుంటారు. ఈ ముగ్గురు ఆస్తులు ఇటీవల మరింతగా పెరిగాయి. కాస్ట్లీ భవనాలు, ఎక్కడికక్కడ స్థలాలు కొనుగోలు చేసినట్టు భోగట్టా. అయితే ఇటీవల కలెక్షన్లు పంపకాల్లో తేడాలు రావడంతో వారి మధ్య విభేదాలు తలెత్తాయి. దీంతో ఒకడు కలెక్షన్లకు సంబంధించిన వివరాలను సోషల్ మీడియాకు లీకులు వదులుతున్నాడు. దీంతో మిగతా వారిలో గుబులు పట్టుకుంది. ఎవరు లీకులు వదులుతున్నారో తెలియక తలలు పట్టుకుంటున్నారు. ఇదే విషయాన్ని ఎవరికివారుగా వెనుకుండి నడిపిస్తున్న పోలీసు అధికారికి సమాచారం అందించారు. దీంతో ఎక్కడ కలెక్షన్ల పర్వం బయట పడుతుందోనని బృంద సభ్యులను పిలిపించి మాట్లాడుతున్నట్టు తెలిసింది. ఈ విషయం జిల్లాకు చెందిన ఉన్నతాధికారులకు తెలిసినా నోరు మెదపడం లేదన్న విమర్శలు పోలీసు శాఖలోనే బహిరంగంగా విమర్శలు ఉన్నాయి. జిల్లా ఎస్పీకి బదిలీ కావడం, కొత్త ఎస్పీ ఈనెల 16న వస్తుండడంతో ఈ ఎస్ఈబీ బృంద సభ్యుల్లో కలకలం రేగింది.

(ఎవరెవరు ఎంత నొక్కేశారన్న దానిపై మరిన్ని వివరాలతో రేపటి 'వార్త' సంచికలో..)

## జిల్లా ఎస్పీగా మహేశ్వరరెడ్డి



**శ్రీకాకుళం క్రైం, జులై 13 (వార్త):** రాష్ట్ర ప్రభుత్వం 36మంది ఐపీఎస్ అధికారులు, ఒక నాన్ క్యాడర్ ఎస్పీని బదిలీ చేసింది. 23 జిల్లాల ఎస్పీలకు స్థానచలనం కలిగించి ఆ స్థానాల్లో కొత్త అధికారులను నియమించింది. పలువురు ఎస్పీలకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ శనివారం ఉత్తర్వులు జారీచేశారు. శ్రీకాకుళం ఎస్పీ జీఆర్ రాధిక, ఏలూరు ఎస్పీ డి.మేరీప్రశాంతి, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్, నంద్యాల ఎస్పీ కె.రఘువీరారెడ్డి, ప్రకాశం ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్, తూర్పుగోదావరి ఎస్పీ పి.జగదీష్, డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ ఎస్పీ ఎస్.శ్రీధర్, వైఎస్సార్ జిల్లా ఎస్పీ సిద్ధార్థ కౌశల్‌కు ఎక్కడా పోస్టింగులు ఇవ్వలేదు. వీరందర్నీ డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు.

### 16న బాధ్యతలు చేపట్టనున్న శ్రీకాకుళం ఎస్పీ..

శ్రీకాకుళం జిల్లా 56వ ఎస్పీగా కేవీ మహేశ్వరరెడ్డి నియమితులయ్యారు. అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరంలో ఓఎస్డీగా పని చేస్తున్న ఆయన ఉద్యోగోన్నతి, బదిలీపై ఇక్కడికి రానున్నారు. ఈ నెల 16న బాధ్యతలు చేపట్టనున్నారు. 2019 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన మహేశ్వరరెడ్డి పది నెలల పాటు గ్రేహౌండ్స్‌లో శిక్షణ పొందారు. 2022లో తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చింటూరు అదనపు ఎస్పీగా వెళ్లారు. 2023 నుంచి అల్లూరి సీతారామరాజు జిల్లా రంప చోడవరంలో ఓఎస్డీగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈయన స్వస్థలం అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి.

### ఎస్పీ జీఆర్ రాధికకు బదిలీ..

ప్రస్తుత ఎస్పీ జి.ఆర్.రాధిక బదిలీ అయ్యారు. జిల్లా పోలీసు అధికారిగా సుమారు రెండేళ్లకుపైగా విధులు నిర్వర్తించారు. జిల్లాలో పని చేసిన కాలంలో వైసీపీ నాయకుల అక్రమాలు, దౌర్జన్యాలకు వంతపాడారనే విమర్శలను ఉన్నాయి. టీడీపీ నాయకులు, కార్యకర్తలపై అన్యాయంగా దాడులు జరిగినా కనీసం పట్టించుకోలేదని ఆ పార్టీ నేతలు బహిరంగంగా విమర్శలు కూడా చేశారు. వీటితో పాటు రెండేళ్లలో భూ వివాదాల్లో తలదూర్చారనే ఆరోపణలు ఉన్నాయి. ఆమెకు ప్రభుత్వం ఎక్కడా పోస్టింగ్ ఇవ్వకుండా డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించింది.

## రిజిస్ట్రేషన్ కావాలంటే..




# చేయి తడపాల్సిందే..


* పలాస సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అధికారులు, సిబ్బందిపై విమర్శలు * కాసులిస్తే సత్వరం రిజిస్ట్రేషన్ * లేకుంటే పత్రాలు సరిగ్గా లేవని షాకులు * అధికారుల అండదండలతో పేట్రేగిపోతున్న దళారులు * సాయంత్రం అయితే వాటాల పంపకాలు * నిత్యం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వాగ్వాదాలు * విజిలెన్స్‌చే విచారణ చేయిస్తే అక్రమాలు బట్టబయలు

**పలాస, జులై 13 (వార్త):** పలాస సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో చేయి తడపనిదే ఫైల్స్ ముందుకుసాగదన్న విమర్శలు ఉన్నాయి. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కొందరు నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్లు చేస్తున్నారన్న అపవాదు ఉంది. ఇక్కడ కొనుగోలు, అమ్మకందారుల నుంచి దస్తావేజు లేఖరులు రిజిస్ట్రేషన్ చేసుకున్న ఆస్తిని బట్టి పర్సంటేజీలు వసూలు చేస్తున్నారు. సాయంత్రం అయితే వసూలు చేసిన పర్సంటేజీలు సంబంధిత అధికారులు, సిబ్బందికి పంపకాలు చేస్తుంటారు. కాసులు వచ్చే పనులకు ప్రాధాన్యమిస్తుంటారన్న విమర్శలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో మొగిలిపాడు, తాళబద్ర, పద్మనాభపురం, చినబాడం, సూది కొండ, నెమలికొండ, రామకృష్ణాపురం తదితర ప్రాంతాలతో పాటు మందస మండలంలో ఉన్న గ్రామాలను అనేక మంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా నిబంధనలకు భిన్నంగా వ్యాపారం సాగిస్తూ అనుమతులు లేనప్పటికీ ప్లాట్లు విక్రయాలు జరిపి సబ్ రిజిస్ట్రారు కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లు జరిపిస్తున్నారు. ఈ వ్యవహారంలో దళారుల దందా కార్యాలయాల సమీపంలోనే జరుగుతుండటం విశేషం. రిజిస్ట్రేషన్లు సమయంలో ప్రభుత్వ నిర్ణయించిన రేటు కన్నా రెండు రెట్లు అధికంగా భారీగా ముడుపులు రిజిష్టర్ కార్యాలయానికి చెల్లిస్తున్నారు. ఇప్పటి వరకు వందలాది మందికి సంబంధించి గృహ నిర్మాణదారులకు సంబంధించి రిజిస్ట్రేషన్లు స్థానికంగా జరిగిపోయాయి. ఇక పోతే మకరజోల సమీపంలో ఉన్న ప్రభుత్వ అసైన్డు భూములు ఇటీవల పలాస రిజిష్టరు కార్యాలయంలో తప్పుడు సర్వే నెంబరుతో జీడి మెండు భూములను ఒక రాజకీయ నాయకుడికి రిజిస్ట్రేషన్ చేసినట్లు సమాచారం. వాస్తవానికి ఈ భూములు రిజిస్ట్రేషన్‌కు పనికిరావు. కాని రెవిన్యూ విభాగం నుంచి అసైన్డ్ భూములు కావని తప్పుడు దృవీకరణ పత్రం సంపాదించి రియల్ ఎస్టేట్ వ్యాపారులు టెక్కలి నియోజకవర్గం పరిధిలో ఉన్న సబ్ రిజిస్ట్రారు కార్యాలయాల్లో ప్లాట్లు కొనుగోలుదారులైన లబ్దిదారులకు రిజిస్ట్రేషన్లు చేయించారని తెలుస్తుంది. ఈ అసైన్డు భూములు విలువ కోట్లు రూపాయిలు ఉంటుందని అంచనా వేస్తున్నారు. కాని ఈ భూమి యజమాని అమ్మకాలు చేయకుండా వేరే వ్యక్తి

... మిగతా 3లో

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం





## విశ్వబ్రాహ్మణులకు సహకారం అందిస్తా

**కొత్తూరు/పాతపట్నం, జులై13(వార్త):** నియోజకవర్గంలోని ఐదు మండలాలలో ఉన్న పంచవృత్తుల విశ్వ బ్రాహ్మణులకు ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా తనవంతు సహకారం ఉంటుందని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. శనివారం పాతపట్నంలో గల శ్రీశ్రీ ఫంక్షన్ హాల్‌లో నియోజక వర్గంలోని ఐదు మండ లాల పంచవృత్తుల విశ్వబ్రాహ్మణ ఐక్యత సంఘం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణ సంఘం అభివృద్ధికి ఎల్లవేళలా కట్టుబడి ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఐదు మండలాల నుంచి విశ్వబ్రాహణులు పాల్గొన్నారు.

# నిరుద్యోగులకు అండగా ఉంటా

*** పాతపట్నం ఎమ్మెల్యే ఎంజీఆర్ * డీఎస్సీ కోచింగ్ సెంటర్ ప్రారంభం**

**కొత్తూరు/పాతపట్నం, జులై13(వార్త):** నియోజకవర్గంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే తన ప్రధాన ధ్యేయంగా పనిచేస్తానని పాతపట్నం నియోజకవర్గం శాసనసభ్యుడు మామిడి గోవిందరావు అన్నారు. రానున్న మెగా డీఎస్సీని దృష్టిలో ఉంచుకుని పాతపట్నం మహేంద్ర జూనియర్ కళాశాలలో మామిడి అప్పారావు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అత్యుత్తమ ఫ్యాకల్టీతో అధునాతన సాంకేతిక పద్ధతులతో ఎంజీఆర్ ఉచిత మెగా డిఎస్సీ కోచింగ్ సెంటర్‌ను శనివారం ప్రారంభించారు. సుమారు 500 మంది అభ్యర్థులు శిక్షణకు హాజరయ్యారు. వారిని ఉద్దేశించి ఎంజీఆర్ మాట్లాడుతూ నేను ఇప్పుడు ఎమ్మెల్యేను అయినప్పటికీ గతంలో చేసినకంటే విస్తృతంగా అనేక సేవా కార్యక్రమాలు చేపడతానని తెలిపారు. తెలుగుదేశం ప్రభుత్వం ప్రకటించిన రానున్న మెగా డిఎస్సీలో జిల్లాలో అత్యధిక పోస్టు పాతపట్నం నియోజకవర్గానికి




రావాలన్న ఉద్దేశంతో కోచింగ్ సెంటర్‌ను ప్రారంభించానన్నారు. రానున్న రోజుల్లో వలసలు నివారణ కొరకు ఇండస్ట్రీయల్ క్యారిడార్ ఏర్పాటు చేసి స్థానికంగా ఉపాధి కల్పించే విధంగా చర్యలు చేపడతానన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, నిరుద్యోగ యువత పాల్గొన్నారు.

# ట్రిపుల్ ఐటీకి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

**కొత్తూరు,జులై 13 (వార్త):** మండలంలోని కొత్తూరు, మెట్టూరు, నివగాం, కడుము గ్రామాలలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదో తరగతి పరీక్షా ఫలితాలలో అత్యధిక మార్కులు సాధించిన ఆరుగురు విద్యార్థినీ,విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తెలిపారు. కొత్తూరు మండలంలోని మెట్టూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి ముగ్గురు విద్యార్థులు ప్రధమస్థానంలో ఎంపిక కావడం విశేషం. పదో తరగతి పరీక్షా ఫలితాల్లో మెట్టూరు జెడ్.పి. హెచ్ పాఠశాల అత్యున్నత ఫలితాలు సాధించింది. ఇదే పాఠశాలకు చెందిన బొల్ల సాయిచరణ్ నూజివీడు ట్రిపుల్ ఐటికి ఎంపిక కాగా, దిండిమ ప్రియదర్శిని, యజ్ఞల జ్యోత్స్నలు శ్రీకాకుళం ట్రిపుల్ ఐ.టిలోకి ఎంపిక అయ్యారు. కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుండి బుయ్యాల నీలిమ అనే విద్యార్థిని శ్రీకాకుళం క్యాంపస్ కు ఎంపికైంది. వీరితో పాటు కడుము జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి కిల్లారి దీప్సికాశ్రీ, నివగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి కౌముది రంజిత అనే విద్యార్థిని శ్రీకాకుళం ట్రిపుల్ ఐటి క్యాంపస్ కు ఎన్నిక అయ్యారు. తమ పాఠశాల నుండి ట్రిపుల్ ఐటి మొదటి విడతలో ఒక్కొక్కరు, ఐటిలో ముగ్గురు విద్యార్థులు ఎంపిక కావడం పట్ల మెట్టూరు జెడ్పిహెచ్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.లక్ష్మి నరసింహం ఉపాధ్యాయులు, కడుము, నివగాం పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కె. తిరుమలరావు, ఎస్ నిర్మల, కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ.గోవింద రావులు ఎంపికైన విద్యార్థినీ విద్యార్థులకు అభినందనలు తెలిపారు.



## నాడు అక్క.. నేడు తమ్ముడు

*** ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివి ఐఐఐటీ ర్యాంకులు సాధన**

*** ఆనందంలో తల్లిదండ్రులు**

**మెళియాపుట్టి, జులై13(వార్త):** విద్యార్థులు తలుచుకుంటే సాధించలేనిది ఏది లేదని మెళియాపుట్టి మండల కేంద్రానికి చెందిన ఇద్దరు విద్యార్థులు గుంటుకు జ్యోత్స్న, గుంటుకు హేమంత్‌లు నిరూపించి పలువురు విద్యార్థులకు ఆదర్శంగా నిలిచారు. వివరాల్లోకి వెళితే.. మెళియాపుట్టి మండల కేంద్రానికి చెందిన గుంటుకు జగదీష్, స్వప్న దంపతులు చాపరలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఉద్యోగాలు చేసుకుంటున్నారు. తమ పిల్లలను మెళియాపుట్టి, కొసమాల ప్రభుత్వ పాఠశాలల్లో చదివించారు. వారి కష్టానికి తగ్గ ప్రతిఫలం వారిద్దరి పిల్లలు పదవ తరగతిలో ఐఐఐటీ ర్యాంకులు ఘనత సాధించారు. 2021 కరోనా సమయంలో పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రభుత్వం నిర్వహించనప్పటికీ తమ కూతురు జ్యోత్స్న ప్రవేశ పరీక్ష రాసి ఉత్తీర్ణురాలై ట్రిపుల్ ఐటీలో సీటు సంపాదించింది. అలాగే కుమారుడు హేమంత్ కూడా ఈ ఏడాది పదవ తరగతిలో 568మార్కులు సంపాదించి శ్రీకాకుళంలో సీటు సంపాదించుకున్నాడు. అక్కా, తమ్ముడు ఐఐటీ సీటు సంపాదించడం పట్ల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



## వడ్డినవలసలో కుళాయిలు ఏర్పాటు

**సారవకోట/జలుమూరు జులై13 (వార్త):** వడ్డినవలస గ్రామంలోని కాలనీలో మండల పరిషత్ నిధులు సుమారు రూ.మూడు లక్షలు వెచ్చించి కుళాయిలు ఏర్పాటు చేస్తున్నారు. కాలనీకి సమీపంలో ట్యాంకు ఏర్పాటు చేసి ఇంటింటికీ కుళాయిల సౌకర్యం కల్పిస్తున్నారు. ఇక్కడ మంచినీటి సమస్య పరిష్కరించాలని ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు దృష్టికి స్థానికులు తీసుకెళ్లగా నిధులు మంజూరు చేసి పనులు చేయిస్తున్నారు.

## విద్యార్థులకు యూనిఫారాలు పంపిణీ

**సారవకోట/జలుమూరు జులై13 (వార్త):** సారవకోట మండలం చీడిపూడి ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు యూనిపారాలను టీడీపీ నేత నిక్కు జనార్ధన్, సర్పంచ్ ప్రతినిధి జరాపు రాము, హెచ్ఎం శ్రీనివాసరావు పంపిణీ చేశారు. శుక్రవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## దళిత మహిళ భూములపై పెత్తందారుల దౌర్జన్యం

**పలాస, జులై13 (వార్త):** గ్రామాల్లో నానాటికి కొనసాగుతున్న దళితులపైన దౌర్జన్యాలు పరిపాటిగా మారాయి. 60 ఏళ్లుగా సాగు హక్కులో ఉన్న దళితుల భూములపై పెత్తందారులు దౌర్జన్యానికి దిగిన ఘటన పలాస మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కాశ్రగడ గ్రామానికి చెందిన దళిత మహిళ చింతల సరస్వతి భూమి సర్వే నెంబర్ 61/7లో గల భూమి సుమారు ఎనిమిది ఎకరాలు సాగు చేస్తోంది. ఆ భూమిపై గ్రామానికి చెందిన కొందరు ఆక్రమించేందుకు సన్నద్ధమయ్యారు. శనివారం రోడ్డు పనులు ప్రారంభించారు. దీన్ని అడ్డుకోవాల్సిన తహశీల్దార్ కూడా కొందరికి వంత పలికారని, తనను అవహేళన చేశారని, తనకు భూమి ఇక్కడ ఏమీ లేదని, ఏం చేసుకుంటావో చేసుకోమని ఆగ్రహం వ్యక్తం చేశారని మీడియా ముందు సరస్వతి కన్నీటి పర్యంతమైంది. రహదారి నిర్మాణానికి తాను అడ్డుకోబోమని, అయితే ఇరువర్గాలు సమానంగా భూమిని ఇవ్వాలన్నారు. ఈ విషయంపై గతంలో కూడా కొందరు తనపై దౌర్జన్యం చేయగా దళిత సంఘాలను కూడా ఆశ్రయించానని ఆమె తెలిపారు.








## మాజీ మంత్రి సీదిరిపై పోలీసులకు ఫిర్యాదు

**పలాస, జులై 13 (వార్త):** చంద్రబాబును అవహేళన చేస్తూ మతిస్థిమితం లేదని తానే సర్టిఫికెట్ చేస్తానని సీదిరి అప్పలరాజు మంత్రిగా ఉన్న సమయంలో అనుచిత వ్యాఖ్యలు చేశారని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. దీన్ని నిరసిస్తూ శనివారం తెలుగుదేశం పార్టీ శ్రేణులతో కలిసి కాశీబుగ్గ పోలీస్ స్టేషన్లో మాజీ మంత్రి అప్పలరాజు పై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారం ఉందని అహంకారంతో ప్రతిపక్ష నాయకుడు అని కూడా చూడకుండా తన ఇష్టానుసారంగా నోరు పారేసుకున్నారన్నారు. చంద్రబాబుకు మతిస్థిమితం లేకపోతే 14 సంవత్సరాల ముఖ్యమంత్రిగా ఎలా పరిపాలించారో ప్రజలకు తెలుసన్నారు. అప్పలరాజుకు మతిస్థిమితం లేక మాట్లాడటం వల్లే ప్రజలు తగిన బుద్ధి చెప్పారని వ్యంగ్యంగా అన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసిన వారిలో టీడీపీ నేతలు పి.విఠల్, లొడగల కామేష్ యాదవ్, వజ్జ బాబూరావు, బడ్డ నాగరాజు, కొండే నరసింహులు, కోన కృష్ణారావు, జోగు మల్లేష్, సప్ప నవీన్, మురళి, రవిశంకర్ గుప్త ఉన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒడిశావాసి మృతి

**ఇచ్ఛాపురం, జూలై 13(వార్త):** స్థానిక బెల్లుపడ పాత టోల్ ప్లాజా వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒడిశాకి చెందిన లబ కుమార్ సాహు (57) దుర్మరణం పాలయ్యాడు. జాతీయ రహదారిపై బరంపూర్ నుండి పలాస వైపు వెళ్తుండగా ద్విచక్ర వాహనం ఢీకొనడంతో మృతి చెందాడు. మృతుడు బరంపురం కొమ్మాపల్లి కి చెందిన వ్యక్తిగా గుర్తించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

## యువతిపై పిడుగు

**కోటబొమ్మాళి, జులై 13 (వార్త):** కోటబొమ్మాళి మండలంలోని విశ్వనాథపురం పంచాయతీ సిందిరిపేటలో శుక్రవారం ఓ యువతిపై పిడుగుపడి మృతి చెందింది. గ్రామానికి చెందిన పల్ల రామదాసు, లక్ష్మీల కుమార్తె రోహిణి (23) డిగ్రీ పూర్తి చేసింది. తల్లిదండ్రులకు వ్యవసాయ పనుల్లో సహాయం చేస్తుండేది. ఇందులో భాగంగానే శుక్రవారం తల్లి లక్ష్మీతో పాటు గడ్డికోతకు వెళ్లింది. ఇంటికి తిరిగి వచ్చే క్రమంలో తల్లి వేరే మార్గంలో వెళ్లిపోగా కొంతసేపటికి రోహిణి పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతి చెందింది. చీకటి పడినా కుమార్తె ఇంటికి చేరక పోవడంతో కుటుంబీకులు, బంధువులు వెతికారు. వ్యవసాయ భూమిలో రోహిణివిగత జీవిగా పడి ఉండటాన్ని గుర్తించారు. కుమార్తె మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

## ఆర్ఎంపీ అరెస్టు

**వజ్రపుకొత్తూరు, జులై 13 (వార్త):** ఓ వివాహితతో అసభ్యకరంగా ప్రవర్తించినందుకు గాను ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఆర్ఎంపీని పోలీసులు అరెస్టు చేసిన ఘటన వజ్రపుకొత్తూరు మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. శారదాపురానికి చెందిన ఉమామహేశ్వరరావు మండల కేంద్రం వజ్రపుకొత్తూరులో ప్రైవేటు క్లినిక్ నిర్వహిస్తున్నాడు. ఓ వివాహిత వంట చేస్తుండంగా చేతికి గాయమైంది. దీంతో బాధితురాలు చికిత్స కోసం క్లీనిక్‌కు వెళ్లింది. ఇంజెక్షన్ నెపంతో ఆమెతో అసభ్యకరంగా ప్రవర్తించగా బాధిత మహిళ ఇంటికి వెళ్లి జరిగిన సంఘటన భర్తకు వివరించింది. బాధితురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కాశీబుగ్గ రూరల్ సీఐ ఈశ్వరరావు పర్యవేక్షణలో విచారణ జరిపి ఆర్ఎంపీని అరెస్టు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

## గిరిజన భవనం పనులు ప్రారంభించాలి

**మందస, జులై13 (వార్త):** మేజరు పంచాయతీ మందసలో అర్థాంతరంగా నిలిచిపోయిన గిరిజన భవనం నిర్మాణం పనులు తక్షణమే ప్రారంభించాలని గిరిజన ఐక్యవేదిక నాయకులు కోరారు. ఈ మేరకు నిలిచిపోయిన భవన నిర్మాణం పనులను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ గిరిజన భవనం స్థలంలో వేరొక భవనం నిర్మాణం జరుగుతోందని దాన్ని ఆపాలన్నారు. అర్థాంతరంగా నిలిచిపోయిన గిరిజన భవన నిర్మాణం పనులు ప్రారంభించి పూర్తి చేయాలన్నారు. ఇదే విషయాన్ని మందస తహశీల్దార్‌తో పాటు డీఈఈకు ఫోన్ ద్వారా తెలియ జేశారు. కార్యక్రమంలో గిరిజన ఐక్య వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ చౌదరి, మహిళ అధ్యక్షురాలు సవర హేమలత, మండల అధ్యక్షుడు సవర నీల కంఠం, గిరిజన నాయకులు సవర డొంబురు, సవర ఢిల్లీరావు, సవర రామారావు సవర సోమేశ్వరరావు, సవర శ్రీను, సవర కిరణ్ పాల్గొన్నారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## పెరుమాళ్‌కు ఎమ్మెల్యే శిరీష పూజలు



**మందస, జులై 13(వార్త):** పలాస నియోజకవర్గం ఎమ్మెల్యే గౌతు శిరీష, వెంకన్న చౌదరి దంపతులు శనివారం మందస గ్రామంలోని వాసుదేవ పెరుమాళ్‌ను దర్శించుకున్నారు. ముందుగా ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యే గౌతు శిరీష దంపతులకు మంగళ వాయిద్యాలతో స్వాగతం పలికి, ఆలయ మర్యాదలతో ఆహ్వానించారు. ప్రధాన అర్చకులు గోపినంబాళ్ళ దాసుకూర్మాచార్యులు, అర్చకులు వేద మంత్రోచ్ఛారణల నడుమ వాసుదేవునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శిరీషా, వెంకన్నచౌదరి దంపతులకు తీర్ధ, ప్రసాదాలు అందజేశారు. వారి వెంట టీడీపీ, జనసేన నాయకులు ఉన్నారు.

## మెరుగైన విద్యుత్ సేవలు అందజేయాలి

**హిరమండలం, జులై13 (వార్త):** విద్యుత్ వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సేవలు అందజేయాలని జెడ్పీటీసి పొగిరి బుచ్చిబాబు కోరారు. శనివారం సుభలాయ్ పునరావాస కాలనీలో విద్యుత్ సమస్యలు చాలా తీవ్రంగా ఉన్నాయన్నారు. రాత్రిపూట విద్యుత్ సరఫరా నిలిపివేస్తుండటంతో దోమలు విలయ తాండవంగా మారిందన్నారు. దీంతో వ్యాధులు ప్రబలుతున్నాయని, నిరాటంకంగా విద్యుత్ సరఫరా అందజేయాలని ఆయన కోరారు. మండలంలో పలు ప్రాంతాల్లో లో ఓల్టేజ్ సమస్య తీవ్రంగా ఉందన్నారు. గతంలో విద్యుత్ సమస్యలపై ఫిర్యాదు చేయడం వల్ల విద్యుత్ సమస్యలు పరిష్కరించటంతో పాటు నూతన స్థంబాలు ఏర్పాటు చేయటం పట్ల విద్యుత్ శాఖ సిబ్బందికి అభినందనలు తెలిపారు.

## నేడు ఏపిడబ్ల్యుజేఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం

**శ్రీకాకుళం టౌన్, జులై 13(వార్త):** ఏపిడబ్ల్యుజేఎఫ్ జిల్లా కార్యవర్గ సమా వేశం ఆదివారం ఉదయం పదిన్నర గంటలకు శ్రీకాకుళం నగరంలోని ఎన్డీవో హెూంలో నిర్వహించనున్నామని ఏపీడబ్ల్యుజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కొం క్యాన వేణు గోపాల్, జిల్లా కార్యదర్శి జి.లక్ష్మణరావు తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు హాజరుకానున్నట్టు వారు తెలిపారు. జిల్లాలోని ఏపిడబ్ల్యుజేఎఫ్ ఆఫీస్ బేరర్లు, కార్యవర్గ సభ్యులు, జర్నలిస్టులు హాజరుకావాలని కోరారు.

## నేడు గరిమెళ్ల జయంతి

**శ్రీకాకుళం టౌన్, జులై 13(వార్త):** శ్రీకాకుళం నగరంలోని గరిమెళ్ల సత్యనారాయణ భవన్‌లో గరిమెళ్ల జయంతి వేడుకలను ఆదివారం ఉదయం పది గంటలకు నిర్వహించనున్నామని ఏపీడబ్ల్యూజే శ్రీకాకుళం జిల్లా శాఖ అధ్యక్ష, కార్యదర్శులు చింతాడ అప్పలనాయుడు, డి.మహరాణా తెలిపారు. నాగావళి తీరంలో గల గరిమెళ్ల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తామన్నారు. యూనియన్ సభ్యులు, జర్నలిస్టులు పాల్గొనాలని కోరారు.

## జిపిఎస్ గజిట్ నోటిఫికేషన్ ఉపసంహరించుకోండి

**శ్రీకాకుళం టౌన్, జులై 13 (వార్త):** ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యోగులకు ఉపాధ్యాయులకు పదవీ విరమణ తర్వాత ఇచ్చే పెన్షన్ ను గ్యారెంటీ పెన్షన్ స్కీం లోకి తీసుకురావడాన్ని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ వ్యతిరేకిస్తుంది. దీనిపై జారీ అయిన గెజిట్ నోటిఫికేషన్ తక్షణమే ఉపసంహరించుకోవాలని ఏపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి ఎస్వీ అనిల్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. గత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేస్తానని హామి ఇచ్చి ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు, కార్మికులకు మోసం చేస్తూ గ్యారెంటీ పెన్షన్ విధానాన్ని తీసుకొచ్చారన్నారు. ఈ విధానం ఇటు ఉద్యోగులకు నష్టపరుస్తూ ప్రభుత్వం పైన తీవ్ర ఆర్థిక భారాన్ని పడేస్తూ కార్పొరేట్ రంగాలకు మేలు చేస్తుందన్నారు. ఉద్యోగులకు ఎంత మాత్రం ఉపయోగపడదన్నారు. ఐదేళ్ల ప్రజాసేవకోసం ఎన్నికైన ప్రజాప్రతినిధులు ఎమ్మె ల్యేలు, ఎంపీలు పెన్షన్ తీసుకుంటూ, ఆరుగాలం శ్రమిస్తూ జాతి సంపదను సృష్టిస్తూ ప్రభుత్వ పాలసీలను, విధానాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావడంలో అహెూరాత్రులు శ్రమిస్తున్న ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు, కార్మి కులకు గ్యారెంటీ పెన్షన్ విధానం పేరుతో భద్రత లేని పదవీ విరమణ అనంతర జీవితంకు గురిచేయడం ఎంత మాత్రము ఆమోదయోగ్యం కాదన్నారు. ప్రభుత్వం తక్షణమే ఈ గజట్ నోటిఫికేషన్ ఉపసంహరించుకోవాలని, 2017లో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మెమో 57ని తక్షణం అమలు చేసి 2003 డిఎస్సీ ద్వారా నియామకం అయిన ఉపాధ్యాయులందరినీ తిరిగి పాత పెన్షన్ లోకి పునరుద్ధరించాలని కోరారు. అలాగే 2004 తర్వాత నియమింపబడ్డ ఉపాధ్యా యులకు, ఉద్యోగులకు, కార్మికులకు పాత పెన్షన్ విధానాన్ని అమలులోకి తీసుకురావాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ శ్రీకాకుళం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మజ్జి మదన్ మోహన్ డిమాండ్ చేశారు.

## కల్వర్టు నిర్మాణం ప్రారంభం

**కొత్తూరు, జులై13 (వార్త):** కొత్తూరు గ్రామ పంచాయతీలోని అల్లువీధిలో కల్వర్టు నిర్మాణాన్ని సర్పంచ్ కృష్ణవేణి దగ్గరుండి పర్యవేక్షించారు. శిథిలావస్థకు చేరిన కల్వర్టును తొలగించి వాటి స్థానాన కొత్త కల్వర్టును నిర్మించారు. కాలువ పూడుకుపోవడంతో స్థానికులు సర్పంచ్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో సర్పంచ్ స్పందించి నూతన కల్వర్టును నిర్మించారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి పడాల లక్ష్మణరావు, లోతుగడ్డ జనార్దన్ పాల్గొన్నారు.

## రిజిస్ట్రేషన్ కావాలంటే చేయితడపాల్సిందే

(మొదటిపేజి తరువాయి)

భూమిగా రిజిస్ట్రేషన్ జరిపించడం సర్వత్రా చర్చనీయాంశం అయింది. ఈ భూమిని రియల్ ఎస్టేట్ వ్యాపారి కారు చౌకగా కొనుగోలు చేశారని తెలుస్తోంది. ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని సమగ్రమైన దర్యాప్తు జరపాలని ప్రజలు కోరుతున్నారు. ఇదిలా ఉండగా తనఖా రిజిస్ట్రేషన్లు కూడా భారీ స్థాయిలో జరిగి లక్షలాది రూపాయిలు చేతులు మారుతున్నాయిని దీనిపై ఎటువంటి చర్యలు లేకపోవడంతో ప్రజల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రిజిస్ట్రేషన్‌కు ముందు దరఖాస్తు చేసుకున్న వెంటనే సిబ్బంది వెళ్ళి ఆయా స్థలాలను పరిశీలించి రిజిస్ట్రేషన్ చేయవలసి ఉండగా అలా జరగడం లేదు. సబ్ రిజిస్ట్రారు కార్యాలయంలో జరుగుతున్న అక్రమాలకు అడ్డుకట్టువేసే వారే కరువయ్యారు. శుక్రవారం కాశీబుగ్గ సబ్ రిజిస్టర్ కార్యాలయంలో పలాస మండలం మాకన్నపల్లి గ్రామానికి చెందిన దానేషు తన భూములకు సంబంధించి రిజిస్ట్రేషన్‌కు దరఖాస్తు చేసుకున్నారు. రిజిస్ట్రేషన్ చేసేందుకు సబ్ రిజిస్టర్ కార్యాలయ సిబ్బంది రూ.15వేలు అడిగారని దానికి దానేష్ నిరాకరించడంతో భూములకు సంబంధించి సరైన పత్రాలు లేవని, సరైన పత్రాలు లేదని షాకుతో రిజిస్ట్రేషన్‌ను నిలిపివేశారని బాధితుడు ఆరోపించారు. ఈ విషయమై సబ్ రిజిస్టర్‌ను వివరణ కోరగా తాను ఎటువంటి లంచం అడగలేదని, రిజిస్ట్రేషన్‌కు తహసిల్దార్ ధ్రువీకరించిన పత్రాలు మాత్రమే అడిగానని తెలిపారు.

## రెంటికోట ఆసుపత్రిలో..

# స్టాఫ్‌నర్సే.. వైద్యురాలు!

* సమయపాలన పాటించని వైద్యులు
* గిరిజనులకు వైద్యం అందడంలో జాప్యం
* తప్పనిసరి పరిస్థితుల్లో సేవలందిస్తున్న స్టాప్‌నర్సు






**పలాస, జులై 13 (వార్త):** సీజనల్ వ్యాధులు ప్రబలుతుండడంతో గిరిజనులు అత్యధిక మంది రెంటికోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వస్తున్నారు. ఆసుపత్రికి వైద్యులు సరైన సమయానికి రావడం లేదు. దీంతో ఓపీ చూడడం ఆలస్యమవుతోంది. జ్వరాల బారిన పడిన వేదనను చూడలేక స్టాఫ్‌నర్సు తప్పనిసరి పరిస్థితుల్లో వైద్యురాలిగా అవతారమెత్తి తనకు చేతనైన వైద్యసేవలను అందిస్తోంది. ఆసుపత్రికి వైద్యుడు ఎప్పుడు వస్తారో, ఎప్పుడు వెళతారో తెలియదని పలువురు గిరిజనులు వాపోతున్నారు. దీంతో వైద్యానికి గిరిజనులు దూరమవుతూ ప్రైవేట్ ఆసుపత్రికి పరుగులు తీస్తున్నారు. ఆసుపత్రి పరిసర ప్రాంతం కూడా తుప్పలతో నిండిపోయి క్రిమికీటకాలకు నిలయంగా మారింది. దీంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు, గర్భిణులు రాత్రిపూట వార్డుల్లో ఉండేందుకు భయపడుతున్నారు. శనివారం ఆసుపత్రికి ఆలస్యంగా వచ్చిన వైద్యుడు సునీల్‌ను మీడియా ప్రతినిధులు వివరణ కోరగా, కారు రిపేర్ అయినందున రావడం ఆలస్యమైందన్నారు.

## జీపీఎస్ గెజిట్ నోటిఫికేషన్‌ను ఉపసంహరించాలి



**మందస, జులై 13 (వార్త):** ఉపాధ్యాయ, ఉద్యోగులు రిటైర్ అయిన తరువాత వారికి రావాల్సిన పెన్షన్‌ను గ్యారెంటీ పెన్షన్ స్కీం పరిధిలోకి తీసుకురావడాన్ని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ మందస మండలశాఖ వ్యతిరేకిస్తోందని అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సవర కిరణ్ కుమార్, కర్రి సుందరరావు డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే సీపీఎస్‌ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని తీసుకువస్తామని చెప్పి, ఈ అసంబద్ధమైన జీపీఎస్ విధానాన్ని ప్రవేశపెట్టిందన్నారు. జీపీఎస్ విధానం ప్రభుత్వంపై ఆర్థిక భారం మోపుతూ, కార్పొరేట్ రంగాలకు లబ్ధి చేకూరుస్తుందే తప్ప ఉద్యోగులకు ఎటువంటి మేలు చేకూర్చదని వాపోయారు. ప్రస్తుత ప్రభుత్వం పునరాలోచన చేసి, ఈ విధానాన్ని రద్దు చేస్తూ, 2017 వ సంవత్సరంలో కేంద్రం ఇచ్చిన మెమో నెం.57ని అమలు చేయాలని, డీఎస్సీ 2003 ద్వారా ఉపాధ్యాయ ఉద్యోగంలో చేరిన వారిని పాత పెన్షన్ విధానంలోకి తక్షణమే తీసుకురావాలని కోరారు. అదేవిధంగా 2004 సెప్టెంబర్ 1 తరువాత ఉద్యోగంలో చేరిన వారికి కూడా పాత పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు. సమావేశంలో ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు గవ్వ భీమారావు, జిల్లా కార్యదర్శి ఎస్.చాణక్య, రాష్ట్ర కౌన్సిలర్ జి.రాజేష్, మందస మండల శాఖ కార్యవర్గ సభ్యులు ఎన్.కరుణాకర్, వి.వి.వరప్రసాద్ రావు, కె.పాపారావు, కె.జగదీశ్వర రావు, డి.చంద్రశేఖర్, డి.వైకుంఠరావు, యన్. ఢిల్లీశ్వరరావు, సుశాంత్ కుమార్ రౌలో, డి.మోహనరావు, కె.చిరంజీవి, బి.మురళీ మోహన్, బి.బైరాగి, ఎస్.గణేశ్వర రావు, ఎం.చిత్రసేను పాల్గొన్నారు.



## రామావతారంలో జగన్నాథుడు

**శ్రీకాకుళం టౌన్, జులై13(వార్త):** శ్రీకాకుళం నగరంలోని ఇల్లిసి పురంలో ఉన్న గుండిచా మందిరంలో జగన్నాథ స్వామి శనివారం రామావ తారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన పూజారి సుభాష్ పండా ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారిని పెద్ద ఎత్తున భక్తులు దర్శించు కున్నారు. గుండిచా మందిరం ఆవరణలో మధ్యాహ్నం, రాత్రిపూట అన్న సమారాధన చేశారు.

**హిరమండలం:** జగన్నాథ స్వామి రథయాత్రలో భాగంగా స్వామి వారు శ్రీరాముడు అవతార రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. గుండిచా మందిరంలో ఏర్పాటు చేసిన జగన్నాథ స్వామిని ఆలయ అర్చకులు సురేష్ పాడీ, శ్రీనివాస్ పాడీలు ప్రత్యేక పూజలు చేశారు.






## క్యాన్సర్ స్క్రీనింగ్‌పై ముగిసిన శిక్షణ

**టెక్కలి, జులై 13 (వార్త):** హెూమీ బాబా క్యాన్సర్ హాస్పిటల్ పర్యవేక్షణలో గత నెల 13న శ్రీకాకుళంలోని గవర్నమెంట్ మెడికల్ కాలేజీ, టెక్కలి జిల్లా ఆసు పత్రిలో ఈ క్యాన్సర్ ట్రైనింగ్‌పై శిక్షణ ఇచ్చారు. జిల్లాలో ఉన్న మెడికల్ కాలేజీ వైద్య నిపుణులు శిక్షణ ఇచ్చారు. జిల్లాలో ఉన్న అన్ని సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో గల గైనకాలజిస్ట్, డెంటల్ సర్జన్లు, జిల్లా టీం శిక్షణ పొందారు. ఈ శిక్షణ కార్య క్రమం యొక్క ముఖ్య ఉద్దేశం ముందుగానే క్యాన్సర్ లక్షణాలు గుర్తించి వారికి సరైన సమయంలో వైద్యం అందజేసి క్యాన్సర్‌ను ఆపేందుకు ఎలా గుర్తించాలి అన్న దానిపై ఈ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలో ఉన్న 151 మంది వైద్యు లకు, 50 మంది పిహెచ్‌సి హెడ్ క్వార్టర్ ఏఎన్ఎంలు, 594 మంది సీహెచ్వో, 53 మంది అర్బన్ ఏఎన్ఎంలకు 3 బ్యాచ్ల వారీగా ఒక్కో బ్యాచ్‌కు రోజుకు 40 మంది చొప్పున టెక్కలి జిల్లా ఆసుపత్రి లో ప్రిన్సిపాల్ డాక్టర్ రవి వెంకటాచలం ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. జిల్లా ప్రివెంటివ్ అంకాలజీ యూనిట్ నోడల్ అధికారి డాక్టర్ నాగేంద్ర, డీఎంహెచ్‌వో డాక్టర్ మీనాక్షి, డిసిహెచ్ఎస్ డాక్టర్ రాజ్యలక్ష్మి, యన్.సి.డి ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సి.పి.శ్రీదేవి, ఎపిడోమోలజిస్ట్ డాక్టర్ సుజాత, జిల్లా యన్.సి.డి టీం సభ్యుల ఆధ్వర్యంలో ఈశిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక



## శ్రీకాకుళం



## వేలం పాట ఖరారు

**వీరఘట్టం, జులై 13 (వార్త):** వీరఘట్టం మేజర్ పంచాయతీ పరిధిలోని 18 షాపులకు గాను 15 షాపులకు శనివారం వేలంపాట నిర్వహించగా రూ.7.48 లక్షలు వేలంపాట ఖరారు అయినట్లు పంచాయతీ కార్యదర్శి పి. రాము తెలిపారు. గత ఏడాది కంటే అదనంగా 72,000 పంచాయతీకి ఆదాయం చేకూరిందన్నారు. ఈ కార్యక్రమంలో వీరఘట్టం టిడిపి పట్టణ శాఖ అధ్యక్షుడు జామి లక్ష్మీనారాయణ, నీటి సంఘం మాజీ అధ్యక్షుడు బళ్ల హరిబాబు, దిబ్బ జయశంకర్ దేవ్ తో పాటు పంచాయతీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కోడి రామ్మూర్తి స్టేడియం పనులకు.. వీడిన గ్రహణం

*** ఎమ్మెల్యే శంకర్ చొరవతో పునఃనిర్మాణ పనులకు శ్రీకారం**



**శ్రీకాకుళం టౌన్, జులై 13 (వార్త):** క్రీడల్లో శ్రీకాకుళం జిల్లా కీర్తిప్రతిష్టలు అంతర్జాతీయ స్థాయిలో ఇనుమడింపజేసిన కోడి రామ్మూర్తి స్టేడియం పునఃనిర్మించేందుకు ఎమ్మెల్యే గొండు శంకర్ కంకణం కట్టుకున్నారు. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు నిధులు మంజూరు చేసి పనులకు శంకుస్థాపన చేశారు. ఆ తరువాత వచ్చిన వైకాపా ప్రభుత్వం రివర్స్ టెండర్ల పేరుతో పనులను నిలుపుదల చేసి ఆ తరువాత మొక్కుబడి పనులకే పరిమితం అయ్యింది. జిల్లాలోని క్రీడాకారులు, వాకర్స్ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ స్టేడియం పునఃనిర్మాణ పనులను తిరిగి ప్రారంభించేలా చర్యలు తీసుకున్నారు. ఆయన చొరవతో స్పందించిన ప్రభుత్వం రీ టెండర్లను పిలిచి ఆమోదించడం కూడా జరగడంతో పనులు మొదలయ్యాయి. ఈ మేరకు జిల్లా ఉన్నతాధికారులతో కలసి ఎమ్మెల్యే గొండు శంకర్ శనివారం స్టేడియం పనులను పరిశీలించారు. అసంపూర్తిగా నిలిచిపోయిన పనులను చూసి ఆవేదన వ్యక్తం చేశారు. క్రీడాకారుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని స్టేడియం పునఃనిర్మాణ పనులు పూర్తి చేసేందుకు నిధులు మంజూరు విషయంలో సహకరించిన కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టి స్టేడియంను త్వరితగతిన అందుబాటులోకి తేవాలని అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో క్రీడాప్రాధికార సంస్థ, నగర కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.




## క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని చాటాలి

విజయంతో సంబంధం లేకుండా క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని చాటాలని ఎమ్మెల్యే గొండు శంకర్ పిలుపునిచ్చారు. నారాయణశెట్టి వెంకట శ్రీనివాసులు (వాసు) స్మారక జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ పోటీలను స్థానిక ఇండోర్ స్టేడియంలో ఎమ్మెల్యే గొండు శంకర్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బాడ్మింటన్ అభివృద్ధికి వాసు చేసిన కృషి అభినందనీయమన్నారు. ఆయన స్ఫూర్తితో జిల్లా స్థాయి బాడ్మింటన్ పోటీలు నిర్వహించడం అభినందనీయమని చెప్పారు. ఈ పోటీల్లో క్రీడాకారులు తమ సత్తా చాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నిర్వాహకులు, బాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ధర్మారావు కుటుంబానికి మాజీ మంత్రి పరామర్శ

**పలాస, జులై 13 (వార్త):** వైఎస్ఆర్ కాంగ్రెసు పార్టీ నాయకుడు పోలాకి ధర్మారావు కుటుంబానికి మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు పరామర్శించారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన అమలకుడియా గ్రామానికి చెందిన ధర్మారావు తల్లి పోలాకి సరోజినమ్మ మృతి చెందింది. ధర్మారావు కుటుంబ సభ్యులను శనివారం సీదిరి అప్పలరాజు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆ కుటుంబానికి అన్ని విధాల ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. మాజీ మంత్రి వెంట వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

## ఎంపీటీసీకి వైసీపీ ఆర్థికసాయం

కిష్టుపురం గ్రామంలో తెలుగుదేశం నాయకులు ఇటీవల ఎంపీటీసీ గొండు మోహనరావుపై దాడికి పాల్పడిన విషయం అందరికీ తెలిసిందే. ఈవిషయం పార్టీ అధినేత, మాజీ ఎమ్మెల్యే జగన్మోహనరెడ్డి దృష్టికి వెళ్లింది. కార్యకర్తలకు అండగా ఉండేందుకు పార్టీ అధిష్టానం ముందుకువచ్చింది. పార్టీ అధిష్టానం అందజేసిన రూ.50వేలును మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు గొండు మోహనరావుకు అందజేశారు. పార్టీ అండగా ఉంటుందని మోహనరావుకు సీదిరి అప్పలరాజు భరోసా ఇచ్చారు. వైసీపీ కోసం పనిచేయడం గర్వంగా ఫీలవుతున్నానని మోహనరావు అన్నారు. జగనన్న కోసం డాక్టర్ సీదిరి అప్పలరాజు కోసం ప్రాణాలు ఇవ్వడానికైనా సిద్ధంగా ఉన్నామన్నారు.





## సీఐటీయూ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ ఎన్నిక



**కొత్తూరు, జులై 13 (వార్త):** కొత్తూరు మండల సిఐటియు వర్కర్స్ హెల్పర్ యూనియన్‌లో శనివారం కొత్తూరు ఐసిడిఎస్ ప్రోజెక్టు నూతన కమిటీ ఎన్నికలు జరిగాయి. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిగా అనురాధ. కె.వి.హేమలత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితోపాటు 18 మంది ప్రోజెక్టు కమిటీ సభ్యులను ఎంపిక చేశారు. ఈసందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ సమస్యలను పరిష్కరించాలని. సమ్మె కాలం ఒప్పందాలను జి.ఓ.లు. వెంటనే ఇవ్వాలని. వేతనాలు పెంచాలని.హిరమండలం కోరాడ సెంటర్ లో విధిలు నిర్వహిస్తూ మరణించిన అంగన్వాడీ ఆయా అప్పలనర్సమ్మ కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు కె.లక్ష్మీ, జలజాక్షి, ధనలక్ష్మి, రజనీ, బోడమ్మ, సంతోషి, తదితరులు పాల్గొన్నారు.

## భార్గవికి అరుదైన అవకాశం



**శ్రీకాకుళం టౌన్ జూలై 13 (వార్త):** శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గొంటి వీధిలో నివాసముంటున్న సవలాపురపు వెంకట రమణ మాదిగ కుమార్తె సవలాపురపు భార్గవి ఎమ్మెస్సీ తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో విద్యను పూర్తిచేసుకుని, అదే కళాశాలలో ఫుడ్ టెక్నాలజీలో పిహెచ్‌డీ చేయడానికి అవకాశం వచ్చింది. ఈమె పిహెచ్‌డి పూర్తి చేయుటకు ప్రొఫెసర్ రజిని నల్లనాగుల గైడ్‌గా వ్యవహరిస్తున్నట్టు భార్గవి తెలిపారు. యూజీసి నెట్ పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యారు. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న నేషనల్ షెడ్యూల్ క్యాస్ట్ ఫైనాన్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా ఎన్ఎస్ఎఫ్సి ఫెలో షిప్ ఇస్తారు. వర్సిటీలోని విద్యార్థి సంఘా ఎన్నికలలో పోటీ చేసి యూనివర్సిటీ కల్చరల్ సెక్రటరీగానూ ఎన్నికయ్యారు. భరత నాట్యం నేర్చుకోని స్కూల్, కాలేజీ, యూనివర్సిటీలో జరిగే పోటీలలో జిల్లా, రాష్ట్ర, దేశ, అంతర్జాతీయ పోటీల్లోనూ భార్గవి పాల్గొంది.




## రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

**బూర్జ, జులై 13(వార్త):** రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని సర్పంచ్ కొరికాన వెంకట శివ సాయి సీతారామ రాజు అన్నారు. శనివారం ఏపీ పేట పంచాయతీ రైతు భరోసా కేంద్రం వద్ద రైతులకు ఖరీఫ్ సీజన్‌కి అవసరమైన ఎరువులను అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి అన్నం పెట్టే రైతన్నను మర్చిపోకూడదని, వారి సంక్షేమం కోసం టీడీపీ ప్రభుత్వం పాటుపడుతుందన్నారు. కార్యక్రమంలో పిఎల్‌దేవిపేట సర్పంచ్ ద్రోణగిరి, తెలుగుదేశం యువనేత కత్తెర అశోక్, వ్యవసాయ శాఖ సిబ్బంది పోలారాజు, తెలుగుదేశం పార్టీ నాయకులు దేవాడ శ్రీనివాసరావు, ముంజు వాసుదేవరావు, భాస్కరరావు, రామ్మూర్తి, సుదర్శన్‌రావు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

## 16న భల్లూకగిరిపై ఆధ్యాత్మికత

**మందస, జులై13(వార్త):** మందస మండలంలోని కుంటికోట, వీరగున్నమ్మపురం, పిడిమందస పరిధిలో గల భల్లూకగిరిపై శ్రీరామానంద యోగ ఆశ్రమంలో ఈనెల 16న అభేదనందస్వామి తృతీయ పుణ్యారాధన కార్యక్రమం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఆశ్రవం అన్యాక్రాంతము కాకుండా సం రక్షణ, అభివృద్ధికి ఒకనిర్దిష్ట ట్రస్టు ఏర్పాటు చేయడానికి అంతా కలసి రావాలని కోరారు

## ఇంట్లో మందు గుండు సామగ్రి పేలుడు




**శ్రీకాకుళంక్రైం/గార, జులై 13 (వార్త):** గార మండలంలోని శెగిడిపేట గ్రామంలో మందుగుండు సామగ్రి పేలడంతో ఒకరు గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. శెగిడిపేట గ్రామంలో కుటుంబ సభ్యులతో ముద్దాడ అప్పన్న జీవనం సాగిస్తున్నారు. ఇంటి వెనుక బాత్ రూం షెడ్ పైన చిన్న సంచిని శనివారం సాయంత్రం 5 గంటలకు అప్పన్న భార్య ముద్దాడ పున్నమ్మ కర్రతో బయటకు లాగింది. ఆ మూట అక్కడ నుంచి కిందపడి పెద్ద శబ్దం వచ్చి పేలుడు సంభవించింది. దీంతో పున్నమ్మకు గాయాలయ్యాయి. కుటుంబీకులు ఆమెను శ్రీకూర్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అవుట్ పోస్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## బాల సంజీవని పంపిణీ



**శ్రీకాకుళం టౌన్, జులై13(వార్త):** శ్రీకాకుళం నగరంలోని అంగన్వాడీ కేంద్రంలో టిడిపి డివిజన్ ఇంచార్జి రొక్కం భాస్కర్, టిడిపి నాయకులు రౌతు సంతోష్‌ల ఆధ్వర్యంలో బాల సంజీవని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ కృష్ణ వేణి, లావణ్య, గర్భిణులు పాల్గొన్నారు.

## ఎయిర్‌పోర్ట్ పనులు పరిశీలించిన మంత్రి రాము

**శ్రీకాకుళం టౌన్, జులై13(వార్త):** ముంబాయి అధికారులతో కలసి నూతనంగా నిర్మిస్తున్న నవీ ముంబై ఎయిర్‌పోర్ట్ పురోగతిని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రివర్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, కేంద్ర పౌర విమానయాన శాఖ సహాయ మంత్రివర్యులు మురళీధర్ మోహల్ తో కలిసి సమీక్షించారు. ఎయిర్ పోర్ట్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్న పనులను పూర్తయిన తర్వాత, ఈ ప్రపంచ స్థాయి విమానాశ్రయం కీలకమైన ముంబాయి నగరానికి ప్రత్యామ్నాయంగా ఉపయోగపడుతోందని తెలిపారు.

Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Editor: Chowdari Pramod E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:016413